సాక్షి ప్రకాశం
I
శనివారం । 15 । జూన్ । 2024



సహజ మార్గం..సాగు సవ్యం
భూమిలో పోషకాలు సమతుల్యంగా ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేస్తే లాభదాయకంగా ఉంటుంది.
- IIలో..



పచ్చిరొట్ట..దిగుబడిలో దిట్ట
భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలో పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట పంటల సాగు.
- IIలో..

గరిష్టం/కనిష్టం
38/28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

పొగాకు ధర గరిష్టంగా రూ.332

- ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు వెల్లడి

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో శుక్రవారం 8861 బేళ్లు రాగా, 8265 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా, 596 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. అందులో ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 81వ రోజు వేలం పాటలో 5683 బేళ్లు రాగా, 5316 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 367 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.331 కాగా, కనిష్టంగా రూ.205 సరాసరి రూ.278.20 వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 76వ రోజు వేలం పాటలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 3178 బేళ్లు రాగా, 2949 బేళ్లు కొనుగోలయ్యాయని, 229 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.332, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.295.28 వచ్చినట్లు వివరించారు.

ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఒంగోలు: ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక జీవో విడుదల చేయాలని నూతనంగా విద్యాశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్‌కు ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాల జీవో కోసం ఎయిడెడ్ ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు ఎదురుచూస్తున్నాయన్నారు. గత కరోనా సమయంలో 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా మరణించారని, ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కారుణ్య నియామకాలకు అర్హులైన 200 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

సాగర మథనానికి సై..

అనంత జలనిధిలో సాహస సమరంతో జీవనం సాగించే మత్స్యకారుల దినచర్య రెండు నెలల విరామం తర్వాత ఈ అర్ధరాత్రి నుంచి ఆరంభమైంది. ఎగిసిపడే కెరటాలను అవలీలగా దాటి కడలి ఒడిలో చేపల వేటనే జీవనంగా మార్చుకున్న గంగపుత్రులకు వేట విరామ సమయమే విశ్రాంతి. ఏడాదిలో పది నెలల పాటు సాగరాన్ని మథించే సాహస జీవనాన్ని సాగిస్తుంటారు. మత్స్య సంపద పునరుత్పత్తి కాలంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు వేట నిషేధం కొనసాగింది. శనివారం వేకువ జాము నుంచి వేటకు బయలుదేరడంతో తీర గ్రామాల్లో సందడి నెలకొంది. ఐదేళ్ల మత్స్యకారులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో పరిహారం పేరిట ఉదారంగా ఆదుకుంది.

- సన్నద్ధమైన గంగ పుత్రులు
- రెండు నెలల విరామం తర్వాత తీరంలో సందడి
- వేట నిషేధ పరిహారంతో ఉదారంగా ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు భృతి రూ.10 వేల కోసం మత్స్యకారుల ఎదురుచూపులు
- చేపల వేట ఆరంభంతో ఆనందంలో మత్స్యకారులు


బోటును సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

తీరం ఇలా..

మూడు అసెంబ్లీలు	తీరప్రాంతం 52 కిలోమీటర్లు
ఐదు మండలాలు	మత్స్యకార కుటుంబాలు 10 వేలు
మొత్తం బోట్లు, పడవలు: 1,503	ఇంజన్ బోట్లు 1,111
పడవలు: 392	

వేట నిషేధ భత్యం అందలేదు



వేట నిషేధ కాలంలో జీవనం కోసం బేల్దారి పనులకు వెళ్లాను. ప్రస్తుతం వేట నిషేధ కాలం ముగుస్తుండటంతో బోటు, వలలు, ఇంజన్ సిద్ధం చేసుకుని వేటకు సమాయత్తమయ్యాను. ఈ సంవత్సరం ఇంకా వేట నిషేధ భత్యం రూ.10 వేలు అందలేదు.
– సైకం మధు, మత్స్యకారుడు, కరేడు

ఉపాధి పనులకెళ్లా..



వేట నిషేధకాలంలో బతుకుతెరువు కోసం ఉపాధి పనికి వెళ్లాను. వారానికి వెయ్యి రూపాయలు కూలీ వచ్చింది. ఇంకా మూడు వారాల డబ్బులు రావాల్సి ఉంది. ప్రస్తుతం రెండు వారాల నుంచి ఉపాధి పని ఆపారు. నాకు పింఛన్ డబ్బులు వస్తాయి. అందు వలన వేట నిషేధ భత్యం రాదు.
– కన్నా సుబ్బారావు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం

వేట నిషేధ భత్యం ఇవ్వాలి..



వేట నిషేధకాలం ముగిసింది. వేట నిషేధకాలంలో ఉపాధి పనికి వెళ్లాను. ఈసారి వేట నిషేధ భత్యం రూ.10 వేలు ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తుందో తెలియదు. వేట నిషేధ భత్యం వస్తే కొంత ఆదరువుగా ఉంటుంది.
– నాయుడు సుబ్బారావు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం

వేట ఇలా..
తెల్లవారుజామున సముద్రంలోకి వేటకు బయలుదేరుతారు. ఐదు కిలో మీటర్లు వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం 10 గంటల లోపు తీరానికి చేరుకుంటారు. పెద్ద బోట్లు ఉన్నవారు మాత్రం రోజుల పాటు సముద్రంలో వేట సాగిస్తారు. సాంకేతిక సహకారంతో సముద్రంలో మత్స్య సంపద కోసం అన్వేషణ సాగుతుంది.

సింగరాయకొండ:

వేట నిషేధ కాలం ముగిసింది. సముద్ర తీరం సందడిగా మారింది. కొంత మంది బాగు చేసుకున్న వలలను తీరానికి చేరుస్తుండగా, కొందరు ఇంజన్లను బోటుకు బిగించుకుని వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. మరికొంత మంది మత్స్యకారులు తీరానికి దూరంగా ఉన్న బోట్లను తీరం దరికి చేర్చుకుంటూ బిజీ బిజీగా ఉన్నారు. నిషేధ కాలంలో బతుకు దెరువు కోసం ఉపాధి పనులకు, బేల్దారి పనులకు, పెయింట్ పనులకు వెళ్లగా కొంతమంది ఆటలాడుకుంటూ, ముచ్చట్లాడుకుంటూ, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి కాలక్షేపం చేశారు. సముద్రునికి, మత్స్యకారునికి సన్నిహిత సంబంధం ఉంది.


తీరానికి వలలు చేర్చుకుంటున్న మత్స్యకారులు

ప్రతి రోజు సముద్రాన్ని స్పృశించనిదే మత్స్యకారునికి జీవితమే లేదు. వాస్తవానికి మత్స్య సంపద పునరుత్పత్తి కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం విధించే 61 రోజుల చేపల వేట నిషేధకాలం శుక్రవారంతో ముగిసింది. శనివారం నుంచి గంగపుత్రులు సముద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించి చేపల వేట ప్రారంభించారు. తెల్లవారుజామున మూడు గంటలకే చేపల వేటకు వెళ్లేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారు. కొత్త వలలను వేటకు ఉపయోగించే మత్స్యకారులు తీరం వద్ద పూజలు చేసి కోడిని కోసి దిష్టితీసి చేపల వేటకు బయలుదేరారు.

తీర ప్రాంతం:

జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5 మండలాల్లో తీర ప్రాంతం విస్తరించి ఉంది. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు, ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలు, కొత్తపట్నం, కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో సముద్రతీరం ఉంది. వేటకు వెళ్లే మత్స్యకారులు 5,459 మంది ఉన్నారు.

అందని విరామ భృతి:

ఏటా వేట విరామ సమయంలో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు పరిహారంగా ఇస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం మొక్కుబడిగా రూ.4 వేలు పరిహారంగా ఇచ్చేది. రకరకాల ఆంక్షలతో సగం మందికి కూడా అందేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. కడలిపుత్రులకు అండగా నిలిచారు. వారి జీవనోపాధికి ఎలాంటి ఆటంకం లేకుండా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.46.880 కోట్లు విరామ భృతిగా అందజేసి అండగా నిలిచింది. జిల్లాలో సుమారు 5,500 మంది వేట నిషేధ భత్యానికి అర్హులుగా ఉన్నారు. జాబితా కూడా మత్స్యశాఖాధికారులు సిద్ధం చేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా వేట విరామభృతి ఇంకా ఇవ్వలేదు.

మత్స్యకార భృతి

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	11,261	11.261 (ఉమ్మడి ప్రకాశం)
2020-21	12,789	12.789 (ఉమ్మడి ప్రకాశం)
2021-22	12,284	12.284 (ఉమ్మడి ప్రకాశం)
2022-23	5286	5.286
2023-24	5260	5.260
2024-25	సార్వత్రిక ఎన్నికల సందర్భంగా భృతి ఇవ్వలేదు	


తీరంలో బిజీబిజీగా ఉన్న మత్స్యకారులు


ఊళ్లపాలెం తీరంలో వేటకు సిద్ధంగా ఉన్న బోటు

పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు


త్రిపురాంతకం మండలం కొత్త అన్నసముద్రం గ్రామపంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు

త్రిపురాంతకం: గ్రామపంచాయతీ కార్యాలయం రంగులు ఎలాంటి అనుమతులు లేకుండా మార్చడంపై గ్రామసర్పంచ్ కే వెంకటేశ్వర్లు అధికారులకు ఫిర్యాదు చేశాడు. త్రిపురాంతకం మండలం కొత్త అన్నసముద్రం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పసుపు రంగుతో నింపేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ అనుమతులతో రంగులు మార్చారా అని ప్రశ్నించినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. అలాంటిదేమీ లేదని తెలపడంతో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదే విధంగా ఎంపీడీవో సాంబశివరావు, ఎస్‌ఐ సాంబశివయ్యకు ఫిర్యాదు చేశామని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామపంచాయతీ కార్యాలయ రంగు మార్చడంపై పలువురు విమర్శిస్తున్నారు. గ్రామపంచాయతీ పాలక మండలిలో ప్రస్తుతం వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఉన్నారు.

సృష్టి ఆర్ట్ అకాడమీకి మిరాకిల్స్ వరల్డ్ రికార్డు


పెయింటింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించిన డాక్టర్ తిమ్మిరి రవీంద్ర

ఒంగోలు మెట్రో: స్థానిక సృష్టి ఆర్ట్ అకాడమీ గత ఏడాది అక్టోబర్ 28, 29 తేదీల్లో ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వంద మంది చిత్రకారులు పాల్గొన్నారు. వారు వేసిన పోర్ట్రైట్ పెయింటింగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఎక్కువ మంది ఒకేసారి పోర్ట్రైట్ పెయింటింగ్స్ వేసినందుకు గాను మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్ సంస్థ నిర్వాహకులు ఈ ఆర్ట్ ఫెస్టివల్‌ను వరల్డ్ రికార్డుగా నమోదు చేసి తమ వెబ్‌సైట్‌లో ఇటీవల పొందుపరిచారు. ఆమేరకు సృష్టి ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ తిమ్మిరి రవీంద్రకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ కార్యదర్శి భానుచందర్, చిత్రకారుడు వై.ఎస్.బ్రహ్మం, డాక్టర్ సంతావేలూరి కోటేశ్వరరావు, తోటపల్లి జాన్ బిల్లిగ్రహం, తూనుగుంట నాగమణి, చెరువు శ్రీలక్ష్మి, బత్తుల మంజవాణి, శిరీష, పలువురు చిత్రకారులు, పలు సాహిత్య, సాహితీ సంస్థలు, కల్చరల్ సంస్థలు రవీంద్రకు అభినందనలు తెలిపారు.

రేపు ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక ఈనెల 16న స్థానిక ఏబీఎం డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పి.లెమ్యూల్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అండర్ 10, అండర్ 13, అండర్ 15 సంవత్సరాల విభాగంలో ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్, రికర్వ్ రౌండ్‌లో ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఆధార్ కార్డు జెరాక్స్, పాస్‌పోర్టు సైజుఫొటో, పుట్టిన తేదీ సర్టిఫికెట్ వెంట తీసుకుని ఎంపికకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజయవాడలో ఈనెల 23 నుంచి 25 వరకు శాతవాహన కాలేజీలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9393636001 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాఠశాల బస్సులు ఫిట్‌నెస్‌తో నడపాలి

- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు
- వాహనదారులకు రూ.1.50 లక్షల జరిమానా


టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

టంగుటూరు: పాఠశాల, కళాశాల బస్సులు ఫిట్‌నెస్‌తో నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం అయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని పాఠశాల, కళాశాల బస్సులు, సరైన పత్రాలు లేని, హెల్మెట్ లేని, సీటు బెల్టు పెట్టని, ఓవర్ లోడుతో వెళ్తున్న 120 వాహనాలను తనిఖీ నిర్వహించి రూ.1.50 లక్షల ఈ చలానా ద్వారా జరిమానా విధించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన మేరుగు

చీమకుర్తి: రాష్ట్ర మాజీ మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన తీరు, అనంతర పరిస్థితుల గురించి వివరించారు.


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మేరుగు నాగార్జున

విద్యార్థుల శాతం పెంచేందుకు స్పెషల్ డ్రైవ్

- ఈ నెల 18వ తేదీ వరకు రోజుకో ప్రత్యేక కార్యక్రమం
- జిల్లా, మండల, గ్రామాల వారీగా కమిటీల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీచేసిన సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్

ఒంగోలు: పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. అందుకోసం ప్రభుత్వంలోని వివిధ విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని పేర్కొంటూ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా, మండల, గ్రామాల వారీగా కమిటీలను నియమించాలని సూచించింది. బడి మానేసిన విద్యార్థుల శాతాన్ని గణనీయంగా తగ్గించేందుకు, బడి బయట పిల్లలను గుర్తించి వారందరినీ బడిలో చేర్పించేందుకు, 6-14 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి విద్యార్థి బడిలో ఉండేలా చేయడమే లక్ష్యంగా ఈ కమిటీలు ఉండాలని ఆదేశించారు.

జిల్లా కమిటీ...
జిల్లా విద్యాశాఖ అధికారి (చైర్మన్), సమగ్రశిక్ష ఏపీవో (మెంబర్ కన్వీనర్), మరో 12 శాఖల అధికారులు సభ్యులు.

మండల కమిటీ...
మండల విద్యాశాఖ అధికారి (చైర్మన్), తహసీల్దారు, ఎంపీడీవో, ఐసీడీఎస్ సీడీపీవో, గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమ అధికారులు, సభ్యులు

గ్రామ లేదా ఆవాస కమిటీలు...
పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ (చైర్మన్), హెడ్మాస్టర్ (మెంబర్ కన్వీనర్), పంచాయతీ కార్యదర్శి, సీఆర్‌పీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది.

డ్రైవ్ ఇలా...
ఈ నెల 15న బాలికా ఉత్సవం, 17న ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, 18న విద్యా సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలన్నీ పాఠశాలల్లో నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

క్లుప్తంగా

నరసింహుని బ్రహ్మోత్సవాలపై నిర్లక్ష్యం

సింగరాయకొండ: ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతుండగా ఏర్పాట్లు చేయడంలో ఆలయ కమిటీ, ఈఓ పి.కృష్ణవేణి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా ఆరోపించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఇంతవరకు ఎక్కడా అతికించలేదన్నారు. వాస్తవానికి ఏటా 15 రోజుల ముందుగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించి చుట్టుపక్కల ఆలయాలకు, మండలాలకు పంపించేవారని కానీ ఈ ఏడాది ఉత్సవాల సమయం దగ్గరపడుతున్నా ఎటువంటి ప్రచారం చేయకపోవడంతోపాటు వాల్‌పోస్టర్లు, కరపత్రాల పంపిణీలోనూ నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. గత సంవత్సరం రథోత్సవం రోజున రథం రోడ్డు మార్జిన్‌లో ఇరుక్కుందని ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శనివారం ఆలయంలో అన్నదానానికి సహకరించే దాతలకు ఆలయ మర్యాదలు సక్రమంగా లేవని ఆరోపించారు. బ్రహ్మోత్సవాలు సక్రమంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, ఈఓ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవుపలికారు.

శ్రీగిరి నిలయునికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ



మేల్ చాట్ వస్త్రాలు సమర్పిస్తున్న రామకృష్ణారావు ఇందిరాదేవి దంపతులు

ఒంగోలు మెట్రో: ఒంగోలులోని కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామికి ఆలయ కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ఇందిరా దేవి దంపతులు శుక్రవారం ఉదయం మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 వ తేదీ శనివారం నుంచి ప్రారంభమై 19 వ తేదీ వరకు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో జరుగుతాయని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. కార్యక్రమంలో అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

సహజ మార్గం.. సాగు సవ్యం!

- మట్టి నమూనా పరీక్షలతో మెరుగైన ఫలితాలు
- వ్యవసాయాన్ని లాభసాటి చేసుకునేందుకు ఉపయుక్తం
- ఎరువుల ఖర్చు తగ్గించుకునేందుకు ఉత్తమ మార్గం



భూసార పరీక్షల కోసం సేకరించిన మట్టి నమూనాలు

కొనకనమిట్ల: మనిషి ఆరోగ్యం గురించి సమగ్ర సమాచారం తెలుసుకోవడం కోసం రక్త పరీక్షలు చేసినట్లుగానే.. భూమిలో పోషకాలు సమతుల్యంగా ఉన్నాయో లేదో తెలియాలంటే మట్టి పరీక్ష చేయాలి. దానినే భూసార పరీక్ష అంటాం. భూమిలోని మట్టిలో సహజంగా ఉండే పోషకాలు, ఖనిజ లవణాలు ఏ స్థాయిలో ఉన్నాయో భూసార పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. అందుకు తగ్గట్టుగా భూమిలో తగిన మోతాదులో పోషకాలు వాడుకున్నట్లెయితే వ్యవసాయం లాభసాటిగా ఉండి పంట దిగుబడి బాగా వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మట్టి సేకరణ ఇలా..

రైతులకు సంబంధించిన పొలాల్లో భూమిలో త్రిభుజాకారంలో 15–20 సెంటీమీటర్ల లోతు వరకు గుంత తీయాలి. అందులో పై పొర నుంచి కింద వరకు మట్టిని సేకరించాలి. ఓ పది మంది రైతుల పొలాల్లో ఒక్కో ప్రాంతంలో మట్టిని సేకరించాలి. అలా సేకరించిన మట్టిని ఓ చోట పోసి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగం మట్టిని అర కిలో మేర తీసుకుని మిగతా మట్టిని వదిలేయాలి. సేకరించిన మట్టిలో వ్యర్థాలు లేకుండా చూసుకుని నీడ ఉన్న ప్రదేశంలో ఆరబెట్టాలి. ఆ మట్టికి సంబంధించిన రైతుల పేర్లు, ఊరు, గతంలో ఏ పంట వేశారు, ఏఏ మందులు వాడారు, పంట దిగుబడి ఏ విధంగా వచ్చింది తదితర వివరాలు సేకరించి రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది. అలా సేకరించిన మట్టిని భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి. ఇదంతా రైతులతోపాటు వ్యవసాయ శాఖ సహాయకులు చేస్తారు. అలాగే పొలంలోనే మట్టిన వ్యవసాయశాఖ అధికారులు డీజీఎస్ చూస్తారు. అంటే సముద్ర మట్టానికి పొలం ఎన్ని మీటర్ల ఎత్తులో ఉందో తెలుసుకుంటారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

భూసార పరీక్షల ద్వారా తక్కువ ఖర్చుతో పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు. నేలలో సహజంగా ఉండే పోషక పదార్థాలు తెలియడంతోపాటు చౌడు గుణాలు గుర్తించవచ్చు. తద్వారా ఏ పంటకు ఏ మేర ఎరువులు అవసరమో తెలుస్తుంది. వేసవి కాలంలోనే మట్టి నమూనా పరీక్షలు చేయడం ఉత్తమం.

> **భూసార పరీక్షలు తప్పనిసరి**
>
> వ్యవసాయ సీజన్‌లో పంట సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. తద్వారా భూమిలో లోపించిన పోషకాలు గుర్తించవచ్చు. అందుకనుగుంగా ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలుంటుంది. పంటకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువులు వాడటం వల్ల ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడి పొందవచ్చు.
>
> – ప్రసన్న రంగలక్ష్మి, ఏఓ



పొలంలో మట్టిని సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



వేసవి దుక్కులు దున్నిన భూమి



జీలుగ పంట

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట..

- భూసారం పెంపునకు ఉపయోగం
- ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం
- 25 నుంచి 35 రోజుల్లో కోత దశకు..

తర్లుపాడు: భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలోనే పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట పంటల సాగు. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర సాగు చేసి భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి నత్రజని తదితర పోషకాలు అత్యధిక పరిమాణాల్లో నేలకు అందుతాయి. పశువుల పేడకంటే పచ్చిరొట్ట పైర్లు పదిరెట్లు అధికంగా నేలను సారవంతం చేస్తాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. తద్వారా కృత్రిమంగా నత్రజని, భాస్వరం వాడకం కూడా తగ్గించుకుని, నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు.ఆశించిన మేర ఫలితాలు ఇస్తుండటంతో గ్రామాల్లో రైతులు ప్రధాన పంటలకంటే ముందు పచ్చిరొట్ట పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

ఉపయోగాలివీ..

పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూమి నీటిని, పోషకాలను నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లిన తర్వాత విడుదల చేసే భాస్వరం, పొటాష్‌తోపాటు గాలిలోని నత్రజనిని నేలలో స్థిరీకరిస్తాయి. తద్వారా నేల సారం పెరుగుతుంది. సూక్ష్మపోషకాలు మొక్కలకు అందుతాయి. సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి మొక్కల వేర్లు అభివృద్ధి చెందుతాయి.

వినియోగం ఇలా..

పచ్చిరొట్ట ఎరువులను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్ఫేట్ వేస్తే పచ్చిరొట్ట త్వరగా కుళ్లుతుంది. మగ్గిన తర్వాతే పంటలో వేసుకోవాలి. పచ్చిరొట్ట సాగుచేసే పొలాల్లో నత్రజని ఎక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని ఎరువులు వాడటం వలన మొక్కలు పెరిగి రొట్ట అధికంగా వస్తుంది.



జనుము పంట

> **పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది**
>
> 
>
> పచ్చిరొట్ట పంటల సాగుతో వ్యవసాయ భూమి సారవంతంగా తయారవుతుంది. భూసారం పెరగడానికి ప్రధాన పంటకు ముందుగా రైతులు విధిగా పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్ట ఎరువుతో దిగుబడి పెరగడంతోపాటు గింజ గట్టిగా ఉంటుంది. ప్రతికూల పరిస్థితులను పైరు తట్టుకుని నిలబడుతుంది. ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించవచ్చు. తర్లుపాడు మండలంలో ఆరున్నర టన్నులకు పైగా రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందించాం.
>
> – ఏఓ వెంకటేశ్వర్లు, తర్లుపాడు

పంట పేరు	విత్తన మోతాదు ఎకరాకు(కేజీల్లో)	ఏ దశలో దున్నాలి	దిగుబడి (టన్నుల్లో)	సహజంగా పంటకు లభించే ఎరువులు		
				నత్రజని	భాస్వరం	పొటాష్
జనుము	16-20	పూత దశలో	5	16-24	7.5	20
జీలుగ	12-16	పూత దశలో	5	30	7.5	20
పిల్లిపెసర	5-6	పూత దశలో	4-5	10-14	1.5-2	7.8
అలసంద	14-15	పూత దశలో	5-7	10-14	1.5-2	7.8
వెంపలి	5-6	పూతదశలో	10-15	10-14	1-1.5	7

జాతీయ పిస్టల్ షూటింగ్‌లో వలసపాలెం యువతికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన ప్రణవి

రంగాయపాలెం (కొత్తపట్నం): జాతీయ పిస్టల్ షూటింగ్ విభాగంలో కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీ వలసపాలేనికి చెందిన ద్వారం ప్రణవి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్‌లో 22వ కుమార్ సురేంద్రసింగ్ మెమోరియల్ షూటింగ్ చాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీలు జరిగాయి. యూత్ విభాగంలో ప్రణవి గోల్డ్‌మెడల్ సాధించగా, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ షూటింగ్ ఉమెన్స్ విభాగంలో రెండు బ్రాంజ్ మెడళ్లు సాధించింది. 2023 నవంబర్ 19న బోపాల్‌లో జరిగిన 66వ జాతీయ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ పోటీల్లోనూ బ్రాంజ్ మెడల్ సాధించింది. మూడు సంవత్సరాల నుంచి స్టేట్ చాంపియన్‌గా వరుస విజయాలతో మంచి ప్రతిభ చాటుతూ బంగారు పతకాలు సాధిస్తోంది. రాబోయే రోజుల్లో ప్రణవి అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి పతకాలు సాధించాలని, గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు లొట్టెంపూడి సలలిత్, రాష్ట్ర కార్యదర్శి డి.రాజ్‌కుమార్, తండ్రి ద్వారం జాలిరెడ్డి, డి.వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు అభినందించారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి

చీమకుర్తి: దివ్యాంగురాలైన యువతిపై ముగ్గురు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామానికి చెందిన 20 ఏళ్ల వయసున్న మూగ, చెవుడు ఉన్న దివ్యాంగురాలిపై మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడ్డారు. అయితే యువతి గర్భం దాల్చడంతో విషయం తెలుసుకున్న ఆమె తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

ఒంగోలు: సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం నిమిత్తం ఈనెల 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇరువర్గాల ఆమోదంతోనే కేసులు పరిష్కరిస్తామని, అదే విధంగా నోటీసులు అందుకున్న కక్షిదారులు ఒంగోలులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం

- గడువు దాటిన సిలిండర్లతో జాగ్రత్త
- గడువు తేదీపై అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం

మేదరమెట్ల: మనం నిత్యం వినియోగించే ప్రతి వస్తువుకు గడువు తేదీ అంటూ ఒకటి ఉంటుందని అందులో భాగంగానే గ్యాస్ సిలిండర్‌కు కూడా గడువు తేదీ ఉంటుంది. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగించడం వలన ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. సిలిండర్లపై ఉండే గడువు తేదీలను ప్రజలకు వివరించడంలో గ్రామాల్లోని ప్రజానీకానికి సిలిండర్ గడువు తేదీపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన దాఖలాలు మండలంలో ఎక్కడా కనిపించడంలేదనే చెప్పాలి.

సిలిండర్‌పై తేదీని ఇలా గుర్తించాలి..

ప్రతి ఇంటిలో గ్యాస్ సిలిండర్ వినియోగం తప్పనిసరిగా మారిపోయింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ తీసుకోగానే దానిపై ఉన్న గడువు తేదీని తప్పక గుర్తించాలి. సిలిండర్ రింగ్‌కు కింది భాగంలో గడువు తేదీ ముద్రించి ఉంటుంది. సంవత్సరంలో ఉండే 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఏ,బీ,సీ,డీ గా అక్షరాలను రాస్తారు. అక్షరం ఏ అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ అక్షరం అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించినదిగా, సీ అయితే జులై, అగస్టు, సెప్టెంబర్ నెలకు సంబంధించినదిగా, డీ అక్షరం అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంభించిన సిలిండరుగా గుర్తించాలి. సిలిండర్ డెలివరీ అయిన వెంటనే సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి సిలిండరు ఏ నెలకు చెందినదో తెలుసుకోవాలి ఒక వేళ గడవు తీరిన సిలిండర్ ఇస్తే తిరగి ఏజెన్సీవారికి ఇచ్చి గడవు ఉన్న సిలిండరును తీసుకోవాలి.



గడువు తేదీని ముద్రించి ఉన్న గ్యాస్ సిలిండర్

గడువు తీరితే ప్రమాదమే..

సిలిండరును ఎక్కువకాలం వాడకేండా పక్కన పెట్టి వాడటం వలన అది ప్రమాదంగా మారవచ్చు. సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి అది ఏ నెలకు చెందినదో తెలుసుకొని వాడుకుంటే మంచిదని లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇకనైనా రెవిన్యూ అధికారులు సిలిండర్లపై ఉండే గడువు తేదీని గుర్తించడం ఏలాగో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రమాదాలను నివారించాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.